క్లుప్తంగా

జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరించండి



మేరిగను కలిసిన జక్కంరెడ్డి సోదరులు

చిల్లకూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయనను శుక్రవారం గూడూరులోని సనత్ నగర్‌లో గూడూరు నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు జక్కంరెడ్డి జనార్ధనరెడ్డి, కడివేడు ఉప సర్పంచ్ జక్కంరెడ్డి మధుసూదన్‌రెడ్డి కలిశారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. త్వరలో అన్ని మండలాల్లోనూ పర్యటిస్తానని తెలిపారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సూళ్లూరుపేట : పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో వెలసిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆలయ ప్రతినిధి చిట్టేటి పెరుమాళ్ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వీకే షోరూం అధినేత మల్లికార్జున దాతృత్వంతో నిరుపేద గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, జేవీవీ ప్రతినిధులు నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రామమోహన్, ప్రభాకర్, సుబ్బారావు, ఆనంద్, సుబ్రమణ్యం, ఉపాధ్యాయుడు రాధయ్య, ఇబ్రహీం, రజనీకాంత్, సుమన్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసాచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ ప్రారంభం



దొరవారిసత్రంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

దొరవారిసత్రం: మండలంలోని ఆటో డ్రైవర్లు శుక్రవారం సీఐటీ యూ అనుబంధంగా ఆటో వర్కర్స్ యూనియన్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. స్థానిక మండల కార్యాలయాల సమీపంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మయ్య, అధ్యక్షుడు కరీమ్, నాయకులు వెంకటరమణ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కలవకొండ లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న వేద పండితులు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి అంకురార్పణ, శుక్రవారం ఉదయం ధ్వజారోహణం చేశారు. శ్రీవారికి నవ కలశ స్నపనం చేపట్టారు. ఆలయాన్ని పూలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మనుబోలు మండలం మడమనూరుకు చెందిన చేవూరు శేషయ్య, పద్మావతి, నెల్లూరుకు చెందిన సర్వేపల్లి బాలసుబ్రహ్మణ్యం, జయంతి, కలవకొండకు చెందిన ఉడతా శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ సుభాషిణి, నెల్లూరు అచ్చయ్య, మంగమ్మ, ఉడతా వెంకటేశ్వర్లు, విజయమ్మ ఉభయదారులుగా వ్యవహరించారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



నాయుడుపేట టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఖేల్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడా పోటీలకు దొరవారిసత్రం మండలం వెలగలపొన్నూరుకు చెందిన చేమూరు గురువర్మతేజ ఎంపికైనట్లు కోచ్ ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బిహార్‌లోని పాట్నాలో ఈనెల 10 నుంచి జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అతన్ని అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ఆదవరం అనుదీప్, వైస్ చైర్మన్ కలికి సుదీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ధారా రవి, పలువురు క్రీడాకారులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

- సకల దేవతలకు ఆహ్వానం
- తిరుచ్చి పీఠంపై నృసింహుడు



ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చి విజయవంతం చేయాలని గరుడుడి ద్వారా సకల దేవతలకు ఆహ్వానం పంపించారు. ఉదయం 5 గంటలకు దేవదేవేరులకు ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించారు. 6 గంటలకు శ్రీవారు, ఆదిలక్ష్మీ అమ్మవారు, ఆంజనేయ స్వామికి పూలంగి సేవ చేశారు. 8 గంటలకు దేవ దేవేరులను, గరుత్మంతుడి చిత్రపటాన్ని తిరుచ్చి పీఠంపై కొలువుదీర్చి ఆలయంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారు తిరుచ్చిపై కొలువుదీరి నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. అక్కడి నుంచి ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. అర్చకులు గరుత్మంతుడి చిత్రపటానికి, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. అష్టదిగ్బంధనం చేసి వేదమంత్రాల నడుమ గరుత్మంతుడి చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను క్రేన్ మండపంలోకి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం చేపట్టారు. అదేవిధంగా రాత్రి 1008 సహస్ర దీపాలంకరణ మండపంలో స్వామి, అమ్మవార్లను తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు.

శేష వాహనంపై ఊరేగిన లక్ష్మీనరసింహుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 10 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవితో కలిసి శేషవాహనంపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డీసీ సాగర్‌బాబు, చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

కొడిముద్దల కోసం పోటీ

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఎంతో విశిష్టత ఉంది. గరుత్మంతుడికి పూజలు, అభిషేకాలకు ఉపయోగించిన ప్రసాదాలను స్వీకరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలో ప్రసాదం కోసం మహిళలు పోటీ పడ్డారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి పూలంగి సేవ, 8 గంటలకు హంస వాహన సేవ, మధ్యాహ్నం 11.50 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు హనుమంత వాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు,



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు



శేష వాహనంపై ఊరేగుతున్న నరసింహ స్వామి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సూళ్లూరుపేట : మన్నేముత్తేరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ ఆర్ మోహిని తెలిపారు. ఈ క్రమంలో మన్నేముత్తేరి, ఇసుకమిట్ట, కోళ్లమిట్ట, దేగలపాళెం, షార్ వై జంక్షన్, ప్రభుత్వాస్పత్రి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ వుండదని తెలిపారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం పొలకేంద్రం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం తుమ్మూరు, జువ్వలపాళెం 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ ఎన్ శివశంకర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాయుడుపేట పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రైల్వే సమస్యలపై వినతి

నాయుడుపేట టౌన్ : చెన్నై నుంచి ప్రతి రోజూ సూళ్లూరుపేట వరకు వస్తున్న మెమూ రైళ్ల (ఈఎంయూ) నాయుడుపేట వరకు పొడిగించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నాయుడుపేట సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కోరారు. వారు శుక్రవారం చెన్నైలోని సౌత్ రైల్వే జోనల్ మేనేజర్ ఆర్ఎన్ సిన్హా, డీఆర్ఎం విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో నిలిపేసిన సికింద్రాబాద్ నుంచి చెన్నైకి వెళ్లే హైదరాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నాయుడుపేటలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ సెక్రటరీ పేర్నాటి జోసెఫ్, సభ్యులు ఆర్ రాఘవన్, రైల్వే వినియోగదారుల సంఘం నాయకులు రవి, కంకిపాటి కిరణ్, యాచ్చ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న ఉభయదాతలు

నాయుడుపేట టౌన్ : గ్రామదేవత పోలేరమ్మ ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పారిశ్రామికవేత్త పెసల జయప్రకాష్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెసల జయరాజగోపాల్, సోదరులు అన్నదానం చేశారు. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బరావు మాట్లాడుతూ జాతర వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసులు, ఇతర శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు, జాతర నిర్వాహకులను దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పెదకాపు అరవభూమి శ్రీనివాసులు రెడ్డి, పెసల కిషోర్ బాబు, నాయకులు నాగిరెడ్డి చంద్రరెడ్డి, వినుకొండ ధనుంజయ, యాదవల్లి జనార్ధన్ యాదవ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు కనమర్లపూడి సురేష్ శెట్టి, దేవత కిషోర్ శెట్టి, గాధంశెట్టి భాస్కర్, గూడూరు కిషోర్ కుమార్, పూజారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డికండ్రిగలో బోరు ఏర్పాటు

చిట్టమూరు : మండలంలోని ఎల్లసిరి పంచాయతీ వడ్డికండ్రిగలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల సాక్షి దినపత్రికలో అభివృద్ధికి ఆమడ దూరం అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నందకుమార్ గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం మండల పరిషత్ నిధులతో రిగ్గు బోరును వేస్తున్నట్టు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు.

వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ



నాయుడుపేట టౌన్ : సినీ నటి సాయిపల్లవి పుట్టిన రోజు సందర్భంగా దామె అభిమానులు శుక్రవారం మేరీ వృద్ధాశ్రమం, చేయూత చిన్న పిల్లల ఆశ్రమం, ప్రభుత్వ వైద్యశాలలో బిర్యానీ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిపల్లవి అభిమాన సంఘం నాయకులు జయప్రకాష్, దిలీప్, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తపస్సు మాను



తపస్సు మాను వద్ద భక్తుల కోలాహలం

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరులోని అరుంధతీయవాడలో మాతా పరమేశ్వరి అమ్మవారి కొలుపునకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో తపస్సు మానుకు పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రంగులతో పరశురాముని ముగ్గును తీర్చిదిద్దారు. సాయంత్రం జమదగ్ని తపస్సుమాను ఏర్పాటు చేశారు. మహిళలు పసుపు నీటి బిందెలు తీసుకువచ్చి తపస్సు మానుకు అభిషేకం చేశారు. వనం కొరుకుట, కార్తీక యుద్ధం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు

కోట: విద్యార్థి దశ చాలా కీలకమైనదని, కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం సృజన -2025 సదస్సు నిర్వహించారు. పలు రంగాల్లో వున్న అవకాశాలపై బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కలిగించారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నైపుణ్యం ఉన్న వారికి అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ చింతా రవీంద్రరెడ్డి, రాధాకృష్ణ, పీటర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

చిల్లకూరు/ఓజిలి : బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, ఓజిలి ఏఎన్ఎం కుసుమకుమారి తెలిపారు. చిల్లకూరు మండలం ఓడూరు పంచాయతీ పున్నపువారిపాళెం, ఓజిలి మండలం అత్తివరం, కురుగొండ, ఆర్మేనిపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కామాక్షమ్మ, వనమ్మ, మహిళా పోలీసు లక్ష్మీభవాని, ఆశావర్కర్ సునంద పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాలకు మరమ్మతులు

కోట : కోట, చిట్టేడులో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాలకు సీఎస్ఆర్ నిధులతో మరమ్మతులు చేపట్టనున్నట్లు బీసీ వెల్ఫేర్ ఇంజినీరింగ్ డీఈఈ రమేష్ తెలిపారు. ఆయన శుక్రవారం కోటలోని బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోటలో బీసీ హాస్టల్‌కు రూ.17.50 లక్షలు, చిట్టేడు బీసీ హాస్టల్‌కు రూ.15 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. వార్డెన్ గజేంద్ర పాల్గొన్నారు.

కండలేరులో 44.685 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 44.685 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వివాహ వేడుకల్లో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి





వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లిని కలిసిన నేతలు

వెంకటగిరి (సైదాపురం) : బాలాయపల్లి మండలం బొల్లావారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శాఖమూరి విజయ్‌కుమార్ నాయుడు కుమార్తె రూప, నితిన్‌కృష్ణ పెళ్లి తిరుపతిలో జరిగింది. ఇందులో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వెందోటి కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం వాకాడులో సైదాపురం మండల నేతలు కలిసి పలు సమస్యలు విన్నవించారు. మాజీ జేసీఎస్ కన్వీనర్లు గుంటమడుగు శ్రీనివాసులురాజు, నారాయణరెడ్డి, కమలపూడి సుబ్బారెడ్డి, మండల బీసీ సంఘం మాజీ కన్వీనర్ బీఎస్‌యాదవ్, నేతలు గంగయ్య, చీర్ల బ్రదర్స్ పాల్గొన్నారు.

ఉగ్రవాదులను ఏరివేయాల్సిందే

నాయుడుపేట టౌన్ : ఉగ్రవాదులు ఎక్కడున్నా ఏరివేయాల్సిందేనని నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య కోరారు. ఆయన శుక్రవారం న్యాయవాదులతో కలిసి నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు వద్ద భారత సైనికులకు సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్ దాడిలో వీరమరణం చెందిన జవాన్లకు నివాళులర్పించారు. అందులో మన రాష్ట్రానికి చెందిన జవాన్ ఎం మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, జీవీఎస్‌కే కిషోర్, న్యాయవాదులు కె.దశయ్య మొదలియార్, పసల చెంగయ్య, ధారా రవి, షేక్ రఫీ, మాధవి, కె.నిత్య తదితరులు పాల్గొన్నారు.



సైనికులకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

నేల రాలిన మామిడి



చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. గూడూరు రూరల్, చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల్లో సుమారు 7 వేల ఎకరాల్లో మామిడి సాగు వుంది. ఈ ఏడాది పూత, పిందె ఆలస్యంగా రావడంతో వచ్చింది. కాయలు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. ఈ క్రమంలో గాలులతో కూడిన వర్షం కురవడంతో కాయలు నేల రాలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నష్టాలు తప్పవని వాపోతున్నారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

చిల్లకూరు మండలం కడివేడు సమీపంలో నేల రాలిన మామిడి కాయలు

మా తండ్రి బాటలో నడుస్తా..

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి ఘన నివాళి



జనార్ధన్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : ‘మా తండ్రి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనేక అభివృద్ధి పనులు చేశారు. ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేశారు. నేను కూడా ఆయన బాటలో నడుస్తూ ప్రజలకు సేవ చేస్తాను’ అని ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వాకాడులో శుక్రవారం నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. జనార్ధన్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అశోక్ స్తంభం కూడలిలోని జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి జనార్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారని తెలిపారు. ఆయన బాటలో తాను నడుస్తానని పేర్కొన్నారు. తన పిల్లల్లో ఒకరు ఇంజినీర్ కావాలని, అలాగే గురుగుండ స్కూల్లో చదివి ఆర్మీలో చేరాలని తన తండ్రికి కోరికలు ఉండేవన్నారు. మొదటి దానిని పెద్ద కొడుకుగా తాను నెరవేర్చానని తెలిపారు. రెండో కోరికను ఎవరూ నెరవేర్చలేకపోయామన్న బాధ ఉందన్నారు. ప్రస్తుతం భారత్–పాక్ మధ్య యుద్ధం జరుగుతోందని, అందరం కలిసి కట్టుగా ఉండాలన్నారు. టెర్రరిస్టులు ఎక్కడున్నా ఇక వారి ఆటలు చెల్లవని, వారిని వదిలిపెట్టేదిలేదన్నారు. సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న సైనికులకు సెల్యూట్ చేస్తున్నట్టు తెలిపారు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం జనార్ధన్‌రెడ్డిది

రాజకీయ దురంధరుడు, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఎంత ఎదిగినా ఒదిగి ఉండేవారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ఆయన కుమారుడు రామ్‌కుమార్ రెడ్డి నడుస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు హిమకుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రమణారెడ్డి, మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సునీల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, పెంచలరెడ్డి, శేషురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసంలో జనార్ధన్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న నేతలు

జనార్ధన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

వెంకటగిరి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొలిగర్ల మస్తాన్‌యాదవ్, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య తెలిపారు. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వర్ధంతిని శుక్రవారం వెంకటగిరిలో ఘనంగా జరుపుకున్నారు. నేదురుమల్లి నివాసంలో జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం త్రిభువని సెంటర్ వద్ద ఉన్న ఎన్‌జేఆర్ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ వెంకటగిరి అభివృద్ధి నేదురుమల్లి కుటుంబంతోనే సాధ్యమన్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో వెంకటగిరిలో 9వ బెటాలియన్, నిమ్మ పరిశోధనా స్థానం, ఐఐహెచ్‌టీ, గురుకుల పాఠశాలల తదితరాలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, నారాయణ, ఏ శ్రీనివాసులు, వహిద, కళ్యాణి, నాయకులు నాగయ్య, దశరథరామిరెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, యస్దానిబాషా, సీహెచ్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేసుకోవాలి

ఓజిలి: గర్భిణులు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. పెదపరియ పీహెచ్‌సీలో శుక్రవారం 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పునరుత్పత్తి, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, సీహెచ్‌వో చలపతి, సిబ్బంది రూప, సుగుణమ్మ పాల్గొన్నారు.

బైక్ బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం మేల్చూరు వద్ద శుక్రవారం బైక్ బోల్తాపడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మేల్చూరు గ్రామానికి చెందిన శివ, మరో వ్యక్తి బైక్‌లో నాయుడుపేట వైపు వెళుతున్నారు. మేల్చూరు రోడ్డు వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. వెనుక కూర్చున్న శివ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు 108లో వెంకటగిరి ఆస్పత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.